# జవాబు దొరకని ప్రశ్న

"ఏయి డబ్బులు?"

కళ్ళెర్రజేసి గద్దించినట్టు అడిగాడు సోములు.

"అదిగో ముక్కాలి పీటమీద ఎట్టినాను. తీసుకో ఎదవ" అంది అప్పలకొండ.

"ఏటి ఒళ్ళు తిమ్మిరెక్కుతున్నాదేటి?" అని డబ్బులు లెక్కచూసి, "అద్దురూపాయి తక్కువయ్యిందేం?" అన్నాడు అప్పలకొండ వైపు చురచుర చూస్తూ.

"ఆడు తీసుకున్నాడు" అంది అప్పలకొండ.

"ఏడు?"

"తాపీమేస్త్రి" పొయ్యిలో కట్టెలు పెడుతూ చెప్పింది అప్పలకొండ.

"ఆడెందుకు తీసుకున్నాడు?"

"ఆడికి మామ్మూలంటా."

"మామ్మూలంటే?"

"అణ్ణుగు."

"ఒళ్ళు పొగరెక్కిందేటి? సరీగా జవాబివ్వనేవు. తంతె..." ఆమె దగ్గరకెళ్ళి చెయ్యెత్తాడు సోములు.

"ఏట్రా, తంతావేటి? నా ఒల్లంత ముద్దనాగున్నాది. ఆ మేస్త్రిరి ఎదవ సిటం నిల్చోనివ్వడు. పొగరుగా పోతే నా డబ్బులు తింత నన్ను తన్నిడానికొత్తావా?"

ఆ మాట ఆమె నోటినుంచి వచ్చి రావటంతోనే ఆమె సిగ అందుకొని గుబ్ గుభామని రెండు గుద్దులు పడ్డాయ ఆమె వీపుమీద. "నాకు పొగరా?" అంటూ వగర్చాడు సోములు.

"ఓరి నాయినో సంపేత్తన్నాడర్రో; నాకేం ఖర్మ వచ్చిందిరో దేవుడో" రాగం తీసింది అప్పలకొండ.

అతను భార్యని ఎన్ని దెబ్బలు కొట్టినా ఆమె ఎంత ఏడ్చినా జోక్యం పెట్టుకోరు ఇరుగు పొరుగు "ఇది ప్రతిరోజూ జరుగుతుండేదే! వాడు తాగుబోతు. అది నోరుముయ్యదు." అనుకుని ఊరుకుంటారు.

"నానే ఇలా బతుకుతున్నానా, అందరాడోల్ల బతుకులు ఇంతేనా?" అని ఆలోచించసాగింది అప్పలకొండ పొయ్యి దగ్గర కూర్చుని వంటచేసూ.

సోములు రిక్షా లాగుతాడు. సాధారణంగా డబ్బులు

ఇంటికివ్వడు, తెస్తే బియ్యమో, కూరో తెస్తాడు. లేకపోతే లేదు. అప్పలకొండ నాలుగిళ్ళలో పాచిపనులు చేస్తుంది. కూలికి వెళుతుంది. ఆ డబ్బులన్నీ లెక్కలడిగి తీసుకుంటాడు సోములు.

ఎప్పుడో ఏ అర్ధరాత్రో అతను తమకంగా దగ్గరకు తీసుకున్నప్పుడు అడుగుతుంది అప్పలకొండ—"మావాఁ! నాకు పూలకోక కొనవా?" అని. "కొంటాన్లే మాటాడక" అంటాడతను. మళ్ళీ ఉదయం గుర్తుచేస్తుంది. "మావాఁ పూలకోక" అని.

అతను కసురుకుంటాడు. "పూలకోకంట. పూలకోక్కి డబ్బులు కూకున్నాయి. నువ్వు పనిచేసేకాడ పాతగుడ్డ అడుక్కో" అంటాడు.

"ఎదవ, రాత్రోమాట పగలోమాట" అంటుంది నిరసనగా అప్పలకొండ.

"మరేటి?" అని వికటంగా నవ్వుతాడు సోములు.

రాత్రి పులుసన్నం పెద్దపెద్ద ముద్దలు తీసుకుని ఆవురావురుమని తింటూ, "యెక్కడ దాచావో అద్దురూపాయి ఇలా పడెయ్యి" అన్నాడు సోములు.

"నేదురా, మేస్త్రీ తీసుకున్నాడంటే నమ్మవేటి?" అంది అప్పలకొండ.

"ఇప్పుడెందుకు నీతో తగులాట. రేపొద్దుట నువ్వే ఇత్తావ్!" అన్నాడు సోములు.

"వాటినీ తరకవు. కావాలంటే మేస్త్రీగోర్ని అడుగు, నే పోతే నేను కూలికే ఎల్లం. నానెక్కడ తెచ్చేది అర్ధ రూపాయి?"

"కూలి కెల్లకుంట కూకుని తింతావు?" తలపంకించాడు సోములు.

"అదురుస్టమంతులు తినరేటి మొగోడు సంపాయించి పెడితే? తాగుబోతెదవ తగులుకుంటే-కూలిసేసినా కడుపు నిండదు."

"ఏటి పేల్తన్నావు? ఏడే తాగనోడు? నీకు కడుపునిండ టంనేదేమటి?" నవ్వేశాడు సోములు. సాధారణంగా రాత్రి వేళ ఆమెతో తగవు తెచ్చుకోడు సోములు. సాయంత్రం వేళ ఉండగానే తాగేస్తాడు. గంట రెండు గంటలు గడిచేలోపలే అప్పలకొండను తిట్టడం కొట్టడం చేస్తాడు. ఆ తర్వాత అతని మైకం కాస్తా విరుగుతుంది. అప్పలకొండ ఒక్కోసారి మొగుడికి బుద్దులు చెబుతుంది. అతను ప్రసన్నంగా ఉన్నప్పుడు పసిగట్టి.

"మావా! మన విలాగ తెచ్చిన డబ్బంతా తినేస్తే ఎలా సెప్పు? మనతోటోళ్లంతా స్వంత బళ్లు కొనుకున్నారు. ఆళ్లతోపాటు నీకు ఇప్పిద్దురు. నువ్వు తిన్నవైన ఓడివైతే ఇద్దరం రెక్కలు ముక్కలయ్యేలా కట్టపడతన్నాం. పూట బత్తెం పుల్ల ఎలుగు నాగే ఉన్నాయి మన బతుకులు. పిల్లా జల్లా పుడితే ఎలా సెప్పు?" అని ఇంకా ఏమో చెప్పబోయే ఆమె మాటకు అడ్డువస్తాడు సోములు. "అలాటి బయపెట్టు

కోక. నీకు పిల్లలుట్టరు" అంటూ ఆమె పిల్లాజల్లా అన్నప్పు డల్లా ఇదేమాట అంటాడు సోములు. అతను డబ్బుకోసం ఆప్రెషను చేయించుకున్నాడని తెలియని అప్పలకొండ. "నాను గొడ్డుదాన్ని అంటావేటి? నాకు ముప్పయిలొచ్చాయా, నలబై లొచ్చాయా? ఆ పరమేసుడి దయనేక కాని" అని ముక్కుచీది ఏడుస్తుంది. "ఊరకోయే ఎర్రిమొకవా ? పుడ తార్లే అంటాడు సోములు.

మర్నాటి ఉదయం "నాకు టీ నీళ్లకి డబ్బులు కావాల అద్దురూపాయియ్యి" అని నిలేసి అడిగిన సోముల్ని కసిరింది అప్పలకొండ "మెదవ రెంనున్నరా, జేబులో బదేసుకున్నాడు. ఇంకా అద్దురూపాయి కావాలంట. ఆడదాని డబ్బు తినడానికి సిగ్గునేదు" అంటూ.

"నువ్వేనేటి? సంపాయిత్తాన్నావు? సదూకున్న ఆడోళ్లు పెద్దపెద్దోళ్లు సంపాయిత్తన్నారే డబ్బులు. మెదవకబుర్లు సెబ తన్నావు. నువ్వే దబ్బు సంపాదించేసినట్టు" నిరసనగానవ్వాడు సోములు.

"సదూకున్న ఆడోళ్ళు మొగుళ్ళ సేతుల్లో జీతా లెట్టేసి దణ్ణవెట్టరు నా నాగా."

"మాట కడతారుగాని తియ్యి. మొకఁడెట్టావో మర్యాదగ?"

"రాత్రి డబ్బులేటి సేసినావు?"

"ఎక్కడున్నాయి ? అప్పుడే అయిపోనాయి. అల్లా ఏల

బియ్యాం అరు బట్టుకొచ్చినాను గద! కోవిటానుకాడ. ఆడు ఊరకుంటాడేటి ?"

"అబద్ధాలాడక. రిక్షా నాగిన డబ్బులు యేటి సేత్త న్నావు ?"

"దాసినానె, దాసుకుంతన్నానె" అని అప్పలకొండ జబ్బపట్టి లాగి కొట్టబోయేడు సోములు.

అతన్ని విసురుగా విడిపించుకొని, "అయితే తియ్యి ఖర్సెట్టు, నానియ్యాల పనిలోకెల్లను. నా ఒల్లంత సిదగొట్టి నట్టుంది" అంది అప్పలకొండ.

"ఎదవ ఏసాలెయ్యాక, పనిలో కెల్లకపోతే పగిలెయ్యా గల్దు. నిన్ను కూకోబెట్టి కూడెట్టడానికి నానేవి సవగ్గనేను. అద్దరూపాయియ్యి."

"నేదురా దేవుడ అంతె ఇనవేటి ?" తల కొట్టుకుంది అప్పలకొండ,

అయినా నమ్మలేదు సోములు. ఆమెమీద చెయ్యిచేసుకొని ఆమె నిస్సహాయంగా రోదిస్తూ, శపిస్తూంటే, విసురుగా రిక్షా తీసుకుని వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళాక కళ్లు ముఖం తుడుచుకొని, ఆడోళ్ల వయి పుట్టకూడదురా దేవుడా! అందులోనూ మాలాటి కులంలో పుట్టకూడదు. అనుకుని తలదువ్వి సిగచుట్టుకొని, అద్దంలో మొకంచూసుకుని బొట్టుపెట్టుకుని తడికతలుపు మూసి దానికి తాడుకట్టి ప్లీడరుగారింటివైపు నడిచింది అప్పలకొండ.

గబగబా నాలుగిళ్ళ దగ్గర పనిముగించుకుని వెళ్ళిపో తూంటే వెనక్కి పిలిచింది అప్పలకొండిని ప్లీడరు భార్య.

"ఏటండమ్మగోరూ? పనేవన్నా ఉంటే సాయంత్రం యేల గలగవచ్చి సేసేస్తానునెండి" అంది అప్పలకొండ ఆమెకు వినిపించేలా గొంతు పెద్ద చేసి.

"అదికాదు. ఇలారా!" పిల్చిందావిడ.

వచ్చింది అప్పలకొండ.

"వెనక ఇంట్లో ఒకరు అద్దెకు దిగారు. భార్యాభర్త లిద్దరే. ఇద్దరూ ఉద్యోగస్తులే. నువ్వు వాళ్ళింట్లో పని చేస్తావా?" అడిగిందామె.

"ఏ యేలప్పుడు సెయ్యాలండి!" అడిగింది అప్పల కొండ కుతూహలంగ. ఆమెకు "ఇద్దరూ ఉద్యోగస్తులు" అని వినగానే వాళ్ళింట్లో పని చెయ్యాలనిపించింది.

"సాయంత్రం వచ్చి గిన్నెలు కడగటం నీళ్లు పట్టడం అవీ చెయ్యవచ్చునట, చేస్తావా?"

"సేస్తానండి. సాయంత్రం వత్తాను" అని గబగబా కంట్రాక్టరు కట్టించే ఇంటివైపు నడిచింది.

"యేటి కొండా? ఇంతాలశ్యమైతే యెలా?" బీడీ వెలిగిసూ అడిగాడు మేస్త్రీ నారాయణ.

"టయిమెంతయ్యిందండి ?" అడిగింది అప్పలకొండ.

"యేది, సల్దన్నం తిన్నావా ?" అడిగాడు నారాయణ అప్పలకొండ వైపు చూసి నవ్వుతూ.

"నేదండి. టయిమయిపోనాదని వచ్చేసినానండి" అని గమేళా చేతిలోకి తీసుకుంది అప్పలకొండ.

పదకొండు గంటల ప్రాంతాన్న ప్రత్యేకంగా అప్పలకొండకి టీ ఇచ్చాడు నారాయణ.

"ఒద్దండి" అంటూ మొహమాటపడుతూనే తీసుకుంది అప్పలకొండ.

సాయంత్రం కూలీలందరికీ డబ్బులిచ్చేసి, చిల్లరలేదు తెప్పిస్తాను సిటవాగు అని అప్పలకొండను ఉంచేశాడు నారాయణ.

అప్పలకొండ ఊడుపులు, కుప్పలు, అని కూలికి వెళ్ళేది కాని, తాపీ పనిలోకి రావటం ఇదే ప్రథమం కావటంవలన అక్కడ మేస్త్రీ విసిరే చలోక్తులు, మగకూలీలు చేసే హాస్యాలు, అంతా కొత్తగా అయోమయంగా ఉంది. తొలి రోజు మేస్త్రీ తనను కొరికేస్తున్నట్లు చూసి ఓ వెకిలి నవ్వు నవ్వి డబ్బులు చేతిలో పెడితే, లెక్కచూసుకొని "అద్దు రూపాయి తక్కువయ్యిందండి" అంది అమాయకంగా. "అది మేస్త్రీగోరి మామ్మూలు" అన్నాడు కూలీ అప్పన్న. "కాబోలు" అనుకుని ఇంటికి వెళ్ళిపోయింది.

"చిల్లర తెమ్మని పంపించాను. రా, ఇలా కూకో"

అని, అప్పలకొండను కూర్చోమని ముందు కుశల ప్రశ్నలు వేశాడు నారాయణ.

"మావోడు మంచోడు కాడండి. తాగేసి తంతాడండి. నాను తెచ్చిన డబ్బులు, ఆడు సంపాయించిన డబ్బులు, అన్నీ తినేసి తాగేత్తాడండి" అని తనంతతానే చెప్పుకుంది అప్పల కొండ.

ఆరోజు అర్ధరూపాయి విరుచుకోలేదు నారాయణ. ఉదారంగా "పకోడీ పొట్లాం కొనుక్కో" అని అర్ధరూపాయి ఇచ్చేశాడు.

"మేస్త్రీ మంచోడు" అనుకుంది అప్పలకొండ.

మర్నాడు "అప్పలకొండ ఆ తట్ట ఎత్తుకోలేదు. ఈ పని చెయ్యలేమా" అని "మేస్త్రీ" జోక్యం పెట్టుకుని తన తోటి కూలీలచేత ఆ పనులు చేయిస్తుంటే "మేస్త్రీగోరు దేవుడు" అనుకుంది అప్పలకొండ.

అర్ధరూపాయి తగ్గించకుండా డబ్బులు ఇచ్చేస్తున్న నారాయణ తన కష్టసుఖాలు విచారించి జాలిపడుతున్నా డనుకుంది.

ఒకవారం తర్వాత "నాయుడుగోరి కళ్యానికి వచ్చేయ్" అని అతను రెండు రూపాయలు చేతిలో పెట్టబోతే తెల్ల బోయి గుడ్లప్పగించి చూసింది. తర్వాత తేరుకుని. "నేనలాంటి దాన్ని కానండి" అంది.

దాని కతను చిరాకుపడ్డాడు. మర్నాడు కూలిలేదు పొమ్మన్నాడు.

*　　　*　　　*

కొత్తగా పనికి వప్పుకున్న అనసూయమ్మగారి ఇంటి వైపు ఆలోచిసూ నడవసాగింది అప్పలకొండ.

"అనసూయమ్మగోరు ఎంత అదృష్టవంతులు? సదువుకున్నారు. ఉద్యోగం చేస్తున్నారు. ముత్తాబయి టిప్ టిప్‌గా ఆఫీసు కెళతారు. వచ్చిన జీతం అంతా కోకలూ, నగలూ కొనుక్కుంటారు. అయ్యగారు ఆవిణ్ణి ఏవీ అనరు. డబ్బులివ్వమని, నీ జీతం యేటి సేశావని అడగరు. యెలాఅయినా సదువుకున్నవోళ్లు సదువుకున్నోళ్ళే. ఆళ్లకి మంచి, సెడ్డా, నాయం, ధర్మం తెలుస్తాయి. మావోడికేటి తెల్చుద్ది! అని అనసూయమ్మ భర్తని అభినందిసూ, తన మొగుణ్ణి తిట్టుకుంటూ, అనసూయమ్మగారి ఇల్లు చేరింది అప్పలకొండ. ఆమె ఉద్దేశ్యంలో చదువుకున్న ఆడవాళ్లు సంపాదించిన డబ్బు భర్తల కివ్వరు. వాళ్లు అడగరు. ఎంచక్కా చీరలు, నగలు కొనుక్కుంటారని.

ఆరోజు అన్యమనస్కంగానే అనసూయమ్మ గారింట్లో పనులు ముగించి ఇంటికి వెళ్ళింది అప్పలకొండ. మేస్త్రీ తనను అలా అడగటం, ఆమె మనస్సు బాధగా, పచ్చిగా ఉంది. మొదట ఈ విషయం సోములుకి చెప్పకూడ దనుకుంది. కాని రాత్రి అతని కౌగిలిలో ఇమిడిపోతూ "సూడు మేస్త్రీగోడు యెలాగ అన్నాడో"...అని చెప్పేసింది. అతను ఆవేశ పడతా

డని, నారాయణని తిడతాడని, అతనితో తగువుకి సిద్ధమవు తాడని అనుకుంటూన్న ఆమె ఊహను తలక్రిందులు చేసూ అన్నాడు సోములు.

"ఓసీ ఎల్ల నేకపోయినావంటే? పెద్ద పెద్దోళ్ళే స్త్రీకేటు పనులు జరగాలంటే పెళ్లాల్ని ఆఫీసర్ల కాడికి పంపిత్తారు. నాను నా రిక్షామీద అలాటోళ్లని బంగ్లాకి తీసుకెల్తూ ఉంతాను గదా!" అని.

ఆమె ఆశ్చర్యానికి అంతులేదు "పెద్దోళ్లు ఇలాటి ఎదవ పనులు సేత్తారా?" అన్న ఆమె అనుమానం తీర్చేసూ మళ్ళీ అన్నాడు సోములు.

"జాతిలో నేదే గొప్ప. నీతిలో ఉందికాని, పట్టుచీర గట్టి పారిటీకెళ్ళే ప్రెతి ఆడదీ పతివ్రతే అనుకోకు. యేటో అలాటోళ్ల కే లేని నీతి మనలాటోళ్ల కేటి? కూలాగ్గేసుకోక యెల్లు. రేపెల్లు నాలుగు డబ్బులెక్కువత్తాయి."

ఆతన్ని విదిలించికొట్టింది అప్పలకొండ. "యేట్రా! తాగిన మైకం ఒగ్గనేదేటి? అలా నోటికొచ్చినట్టు పేల్త న్నావు. ఎదవ డబ్బుకోసం యెదవ పని సెయ్యమంటావా సిగ్గులేనోడా?" అని తిట్టింది.

"పోన్లేయే. ఇసయం సెప్పేను. పెద్దోళ్ళే పెళ్లాం సేత యిలాటి పనులు సేయిత్తన్నారు. మనలాటోళ్ళ కేటని."

"వల్లకో నోరుముయ్యి. ఎదవ కబుర్లు సెప్పక సదువు కునోళ్ళు నీ నాగ ఒగ్గరు" అంది అప్పలకొండ.

కాని మర్నాడు అనసూయమ్మ గారి గదిలోంచి విన వచ్చే సంభాషణ ఆమెను వీధి గడపలోనే నిలబెట్టేసింది.

అతనంటున్నాడు. "ఈ నెల జీతమంతా ఏం చేశావ్?..."

"అమ్మకి వంట్లో బాగోలేదని ఉత్తరం వస్తే ఓ పదిహే పంపించాను. చీర..." ఆమె నోటి వెంట వచ్చిన వెంటనే చెళ్ళున చెంపదెబ్బ శబ్దం.

"ఓలమ్మో! జీతం తెచ్చి అమ్మని ఎలా కొడతన్నాడు! ఏటీ మొగోళ్ళ జులుం" అనుకుంది అప్పలకొండ.

"నా జీతం నా యిష్టమొచ్చినట్లు చేసుకుంటాను. ఎప్పుడు పంపించాను కనుక? ప్రతినెలా అణా పైసలతో మీరే తీసుకుంటున్నారు." రోషంగా అంటూంది అనసూయమ్మ.

"నాతో చెప్పవా? నా జీతం. నా డబ్బు వీడికెందుకు చెప్పాలని ఔగరు! అవునా?" అతని గొంతు అరిచినట్టుంది.

"పోనీ అలానే అనుకోండి."

"ఏమిటి? అలానే అనుకోనా?" అతను ఆమెను తిడు తున్నాడు. పుట్టింటికి పొమ్మంటున్నాడు. ఆమె సన్నగా ఏడు స్తూంది,

"ఛి. ఛి. ఏటో ఆడోళ్ళ నుద్ధరించే త్తన్నవని ఎదవ కబుర్లు సెబతారు సబల్లో నిలబడి" తాను వింది ఓరోజు.

బజార్లో పార్కు కాడ జనం గుమిగూడితే ఏటో అని తనూ వెళ్ళి నిల్చుంది. అతను పెద్దగొంతుతో చెప్పే మాటలన్నీ తనకర్థం కాలేదుకాని, "ఆడోళ్ళు సదువుకుంటున్నారు. ఉద్యోగాలు సేత్తున్నారు. దేశంలో ఆడోళ్ళని మగోళ్ళు దేవతల నాగ సూస్తున్నారని" సెప్పినాడు. ఏటో ఎదవ కబుర్లు ఎక్కడో నూటికి ఒకళ్ళో ఇద్దరో బతుకుతున్నారేమో సుఖంగా. ప్లీడరుగోరు పెళ్లాన్ని దేవతలాగే సూసుకుంతరు. ఆ యమ్మ ఏటీ సంపాదించటం నేదు. గుమస్తాగోరయితే ఇంటికాడున్నంత సేపూ సిరుబురు లాడుతునే ఉంటరు." అని తానెరిగిన సంసారాలు గుర్తుచేసుకుంటూ తలుపు తట్టింది అప్పలకొండ "అమ్మగోరూ" అని పిలుసూ.

తలుపు తెరచిన అనసూయమ్మ ముఖం కంది ఉంది. కనురెప్పలు తడిగా ఉన్నాయి. "ఏటోనమ్మా మనబతుకులు" అనుకొంది అప్పలకొండ.

గిన్నెలు కడుగుతున్నంత సేపూ ఆమె ఆలోచిస్తూనే ఉంది. "ఆళ్ళతో సరిగ్గా డబ్బు సంపాయిస్తున్నాం. కష్టపడుతున్నాం కదా. ఈ మొగాళ్ళకే ఆడోళ్ళంటే ఎందుకింత అలుసు!" అని ఆ ప్రశ్నకు ఆమెకు జవాబు దొరకలేదు.

వెళ్ళిపోతూ. అనసూయమ్మ ఇచ్చిన పచ్చడి ఆకు మడిచి పవిటకొంగుకి కట్టుకుంటూ, "నాను కూలి సేస్తనండి. పాచిపన్లు సేత్తానండి. అన్ని డబ్బులూ మావోడే తీసుకుంటాడండి. కానీ తక్కువయితే తంతాడండి, నాకు తెలవకడుగు

తాను. మనం సంపాయించే డబ్బు మీాద మనకు అక్కు లేదా అమ్మగోరూ?" అడిగింది అప్పలకొండ.

తమ సంభాషణ అప్పలకొండ విన్నదని గ్రహించిన అనసూయ చిన్నగా నవ్వేసూ, "ఎందుకులేదే పో పొద్దు బోయింది" అంది తడబాటుగా. ఆమె జవాబు తృప్తిగా అనిపించలేదు అప్పలకొండకి. అదే ప్రశ్న రాత్రి సోముల్ని వేసింది. "మాదా? ఆడోళ్ళు సంపాయిత్తన్నారు కదా! అల్ల డబ్బుమీాద ఆల్లకి అక్కు ఉండదా?" అని.

వాడా టక్కున జవాబిచ్చాడు "ఉండదు" అని.

"ఎదవ కబుర్లాడక సెబుదూ?" అంది మళ్ళీ అప్పలకొండ.

"నాను సెప్పేదీ అచ్చరాలా నిజం. శాస్తరంలో రాసుంది. ఆడదానికి అది సంపాయించిన డబ్బుమీాదన్నా అక్కు నేదు. సూడు అవదాని పంతులు కూతురు ఉద్యోగం సేస్తుంది. ఆ పిల్ల జీతం ఆళ్ళ నాన్న తీసుకుంతన్నాడు. పెళ్ళయితే మొగుడు తీసుకుంతాడు. ఆడు సస్తే కొడుకు! అంతేనే ఎర్రిమొకవా? ఏడో సెప్పేడంతే శాత్తరం రాసీడంటె దాని పెకారం నడుత్తారేటి?" అని నవ్వాడు సోములు గలగలా.

"నాకు తెలవకడుగుతానూ? మొగుడికేటి దాని డబ్బు మీాద అక్కు?" అడిగింది అప్పలకొండ.

"మీా అయ్య నిన్ను నాకిచ్చేసినాడు గాదంటే? నీ

డబ్బే ఏటి నిన్న ఏ ఓటేలుకన్నా అమ్మే సే అక్క కూడా నాకుంటది." అన్నాడు సోములు మీసం మెలేసి, తలెగరేసూ.

"అలాటి ఎదవలూ ఉంతార్లె, మీ మొగాళ్ళ కెప్పుడు బుద్దులొత్తాయో!" అంది అప్పలకొండ.

"మాకు పుట్టకతోటి వస్తదే బుద్ది" అన్నాడు సోములు.

అతనితో వాదించి లాభంలేదనుకున్న అప్పలకొండ ఆలోచనలో పడిపోయింది. "పెళ్ళాంసేత కూలి సేయిత్తరు. వంటపని సేయిత్తరు. పెత్తనంసెలాయిత్తరు. ఏటిది? పెద్దోళ్లు సదుకున్నాళ్ళదగ్గర నుంచి మాలాటోలదాక ఏటి ఆడదాని మీద పెత్తనం మొగోడికే..." అని తల బద్దలుకొట్టుకున్నా ఆమెకు ఆ ప్రశ్నకు జవాబు దొరకలేదు.

"ఆడదంటే అలుసుకాదోయ్. అవనిలో దేవతే..." ఎదర కిల్లీ బడ్డీమీద రేడియోలోంచి పాట వినిపిస్తోంది.

"ఆ వల్లకో ఎదవపాట" చిరాగ్గా అంది అప్పలకొండ.

...o...